
www.prajasakti.com

ప్రజాశక్తి

సోమవారం 30 జూన్ 2025

5

చిత్తూరు



మామిడి రైతులకు ఎకరాకు రూ.50వేల ఇవ్వాలి

ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి

మ్యాంగో బోర్డు ఏర్పాటు చేయాలి : జిల్లా కార్యదర్శి హేమలత




ప్రజాశక్తి - రామచంద్రపురం, తిరుపతి బ్యూరో

ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని మామిడి రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి విమర్శించారు. ఆదివారం తిరుపతి జిల్లాలోని రామచంద్రాపురం మండలంలోని పివిపురం పంచాయతీ, రామిరెడ్డి పురం గ్రామంలో మామిడి చెట్లు నరికేసిన రైతులను కలిసి క్షేత్రస్థాయిలో మామిడి తోటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మామిడి పంటకు ప్రభుత్వం ప్రకటించిన కేజీకి రూ.12లు అందేటట్లు ప్రభుత్వం చూడాలని డిమాండ్ చేశారు. మామిడి పంటలు నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.50వేలను అందజేయాలన్నారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర ప్రకటనలకే పరిమితమవుతున్నదని, మామిడి గుజ్జు ఫ్యాక్టరీల యజమానులు, వ్యాపారస్తులు సిండికేట్‌గా మారి రైతుల నుంచి కేజీ రూ.2లకే కొనుగోలు చేసి మోసం చేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వం కేజీ రూ.8లకు కొనుగోలు చేయని గుజ్జు పరిశ్రమలు, వ్యాపారస్తులపై ఎందుకు కఠిన చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. మామిడి పంటకు భవిష్యత్తులో మద్దతు ధర కూడా కరువు అవుతుందని మామిడి చెట్లు నరికేసి ప్రత్యామ్నాయ పంటలైన వరి, వేరుశనగ పంటలు పండించడానికి మొగ్గుచూపుతున్నారని పేర్కొన్నారు. ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి హేమలత మాట్లాడుతూ రాష్ట్రంలో పొగాకు, మిర్చికి బోర్డులు ఏర్పాటు చేసి గిట్టుబాటు ధర కల్పిస్తున్నప్పుడు మామిడి పంటకు ఎందుకు మ్యాంగో బోర్డు ఏర్పాటు చేయరని ప్రశ్నించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు మామిడి రైతులపై మమకారం ఉంటే వెంటనే మ్యాంగో బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. మామిడి రైతులకు ప్రభుత్వమే కేజీకి రూ.12లు మద్దతు ధర చెల్లించి మామిడి కాయలను కొనుగోలు చేయాలని సూచించారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాకు చెందిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మామిడి రైతులను ఆదుకునేందుకు గుజ్జు ఫ్యాక్టరీల యజమానులపై కఠిన చర్యలు తీసుకుని, మామిడి రైతులకు మద్దతు ధర కల్పించాలని డిమాండ్ చేశారు.

'ఖరీఫ్' సాయం కోసం ఎదురుచూపులు

- పంట నష్టానికి పరిహారం ఎప్పటికో...?
- కరువు మండలాల్లో రైతులు ఎదురుచూపులు...
- ప్రభుత్వంపై అన్నదాతల ఆశలు..



నీరు లేక ఎండిన వేరుశనగ పంటను చూపుతున్న రైతు (ఫైల్ ఫొటో)

ప్రజాశక్తి- చిత్తూరు (యాదమరి):

ప్రకృతి వైపరీత్యాలతో దెబ్బతిన్న పంట నష్టానికి సంబంధించిన పరిహారం కోసం రైతులు నెలలు తరబడి ఎదురుచూస్తున్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభ సమయంలోనైనా సాయం అందితే పెట్టుబడులకు కొంత ఊరట లభించనుంది. ఇది ఎప్పటికీ ఇస్తారో కూడా తెలియని పరిస్థితి నెలకొంది. 2024 ఖరీఫ్‌లో ఆగస్టు వరకు వర్షాభావంతో ఆ తర్వాత అధిక వర్షాలకు పంటలు దెబ్బతిన్నాయి. దీంతో ప్రభుత్వం కరువు మండలాలను ప్రకటించింది. కానీ ఆయా మండలాల్లో పంట నష్టపోయిన రైతులకు ఇప్పటివరకు నష్టపరిహారం అందలేదు.

ఖరీఫ్ పంట నష్టపరిహారం కోసం జిల్లాలోని కరువు మండలాల రైతులు నేటికీ ఆశగా ఎదురుచూస్తున్నారు. ఈ సంవత్సరం ఖరీఫ్ పంటపై ఎన్నో ఆశలు పెట్టుకున్న రైతుల ఆశలు అడియాశలయ్యాయి. ఈ సంవత్సరం వర్షాలు సకాలంలో పడకపోవడంతో కనీసం పెట్టిన పెట్టుబడి, ఖర్చుకు కూడా దిగుబడి రైతుల చేతికి అందలేదు. 2024లో రాష్ట్ర ప్రభుత్వం చిత్తూరు జిల్లాలోని 31 మండలాల్లో 16 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించింది. ఈ సంవత్సరంలో ఖరీఫ్ పంట వేసి నష్టపోయిన రైతుల జాబితాను వ్యవసాయ శాఖ అధికారుల సేకరించారు. జిల్లాలో 16 మండలాల్లో 24342 మంది రైతులను గుర్తించారు. 9068.88 ఎకరాల్లో పంటనష్టం వాటిలిందని వ్యవసాయ అధికారులు గుర్తించారు. రూ.1,542 లక్షల రూపాయలు నష్టపరిహారంను అంచనా వేసి నివేదికను తయారుచేసి ప్రభుత్వానికి పంపించారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం కరువు మండలాల్లో నష్టపోయిన రైతులకు ఇప్పటివరకు ఎలాంటి నిధులను మంజూరు చేయలేదు.

గత ఏడాది ఖరీఫ్‌లో నిండా నష్టపోయాం...

- రామదాసు, కొత్తూరు, యాదమరి మండలం



గత సంవత్సరం ఖరీఫ్‌లో వేరుశనగ సాగు చేసి నిండి నష్టపోయాం. వ్యవసాయ అధికారులు వచ్చి నష్టపరిహారం రాసుకునిపోయారు. ఇంతవరకు మాకు సాయం అందలేదు. గత సంవత్సరం ఖరీఫ్ సీజన్లో వేరుశనగ పంట వేసాం. పంటను బాగా వచ్చేందుకు పొలం దున్నడానికి, పొలంలో కలుపు తీయడం, వేరుశనగ ఒబిడి చేయటం అవన్నీ కలుపుకుంటే ఎకరాకు రూ.25, 000లు ఖర్చు అయింది. గత సంవత్సరం సకాలంలో వర్షాలు పడకపోవడంతో పంటలు ఎండిపోయాయి. సుమారు 15 బస్తాలు రావాల్సిన వేరుశనగ రెండు మూట్లు మాత్రమే వచ్చింది. పెట్టిన పెట్టుబడి కూడా రాకపోవడంతో అప్పులు పాలై నష్టపోయాం.

ప్రభుత్వ సాయం కోసం చూస్తున్నాం..

- ఏకాంబర రెడ్డి, కృష్ణంపల్లి



ప్రభుత్వం గత సంవత్సరం నష్టపోయిన పంటకు నష్టపరిహారంగా కాస్త సాయం అందిస్తే ఈసారి పెట్టుబడి పెట్టి విత్తనాలు విత్తేందుకు కొంచెం ఆసరాగా ఉంటుంది. ప్రభుత్వం పంట నష్టపోయిన రైతులకు నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలి. లేకుంటే ఈ సారి వేరుశనగ సాగు చేయడం కష్టమే.

ప్రభుత్వ సాయం రైతుకు అందడం లేదు

- వాడ గంగరాజు, సిపిఎం జిల్లా కన్వీనర్




ప్రభుత్వం నుంచి రైతులకు సాయం అందడం లేదు. ప్రతిసారి రైతును మోసం చేస్తున్న పరిస్థితి. గతంలో కరువు మండలాలు ప్రకటించి కరువు సాయం చేస్తామని చెప్పి ప్రభుత్వం ఇప్పటివరకు ఎలాంటి సహాయం చేయకపోవడం దారుణం. ఈ సంవత్సరం జిల్లాలో అసలు కరువు లేదని ఒక మండలాన్ని కూడా కరువు మండలంగా ప్రకటించకపోవడం మరోసారి రైతులను మోసం చేయడమే. గత సంవత్సరం 16 మండలాల్లో కరువు ఉందని ప్రభుత్వమే స్వయంగా ప్రకటిస్తే మరి ఈ సంవత్సరం ఒక మండలాన్ని కూడా పట్టించుకోవడం దారుణం. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ప్రకృతి వైపరీత్యాలతో ఖరీఫ్ సీజన్లో నష్టపోయిన రైతులకు గతంలో కరువు మండలాలకు ప్రకటించిన మండలాల రైతులకు పరిహారం వెంటనే చెల్లించి రైతులను ఆదుకోవాలి.



నేటి నుంచి విధుల బహిష్కరణ

నగరపాలక సంస్థ కమిషనర్‌కు వినతి



నగర కమిషనర్‌కు సమ్మె నోటీసు ఇస్తున్న యూనియన్ నేతలు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు చిత్తూరు నగరపాలక సంస్థ ఇంజనీరింగ్ విభాగంలో పనిచేస్తున్న ఔట్సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులు సోమవారం నుంచి విధులను బహిష్కరించనున్నారు. విధుల బహిష్కరణపై ఈ మేరకు ఆదివారం చిత్తూరు నగరపాలక కమిషనర్ పి.నరసింహ ప్రసాద్‌కి సమ్మె నోటీసును అందజేశారు. నగరపాలక సంస్థలో ప్రధాన విభాగమైనా మంచినీటి సరఫరా పనుల్లో 30వ తేదీ సోమవారం నుండి పూర్తిగా విధుల్లో పాల్గొనడం లేదని వినతిలో పేర్కొన్నారు. నగరపాలక సంస్థలో పనిచేయుచున్న ఇంజనీరింగ్ కార్మికులు అందరూ విధుల బహిష్కరణలో పాల్గొన్నట్లు తెలిపారు. అసోసియేషన్ అధ్యక్షులు ఎం.శరవణ, ప్రధానకార్యదర్శి డి.శివకుమార్, కోశాధికారి కె.ఆర్.శివప్రసాద్, గౌరవసలహాదారు పి.వెంకటేష్, ఉపాధ్యక్షులు ఎం.హరికష్ణ, ఎన్.వెంకటేష్, జాయింట్ సెక్రెటరీ టి.గోపాలాచారి, ఏ.ఉష, యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

సిఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్



సిఎం పర్యటన ఏర్పాట్లు పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్

ప్రజాశక్తి- శాంతిపురం: జూలై 2,3 తేదీలలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కుప్పం నియోజకవర్గం శాంతిపురం మండలంలో పర్యటించనున్న పలు ప్రదేశాలను జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదివారం ముందస్తుగా పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్, కడా పీడీ వికాస్ మరమ్మత్, కుప్పం ఆర్డీవో శ్రీనివాసులు సిఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలించారు. కుప్పం- పలమనేరు జాతీయ రహదారి పక్కన తులసి నాయనిపల్లి గ్రామం మోడల్ స్కూల్, దగ్గర పబ్లిక్ మీటింగ్, తిమ్మరాజుపల్లి గ్రామంలో జరిగే కార్యక్రమాలకు సంబంధించి పనులను పరిశీలించారు. కలెక్టర్ వెంట శాంతిపురం తహశీల్దార్ శివయ్య, ఎంపీడీవో కుమార్, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలను బలోపేతం చేయాల్సింది ప్రభుత్వమే..

- యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జీవీ రమణ

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ప్రభుత్వ పాఠశాలలో పిల్లలను చేర్పించి, మంచి విద్యను అందించి, తల్లిదండ్రులకు నమ్మకం కలిగించి ప్రభుత్వ పాఠశాలను విద్యాకేంద్రాలుగా మార్చుకుందామని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జీవి రమణ పిలుపిచ్చారు. ఆదివారం చిత్తూరు జిల్లా యుటిఎఫ్ కార్యవర్గ సమావేశం జిల్లా అధ్యక్షులు సోమశేఖర్ నాయుడు అధ్యక్షతన జిల్లా యుటిఎఫ్ కార్యాలయంలో జరిగింది. యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జీవి రమణ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని దానికి అనుగుణంగా విద్యావిధానాన్ని అమలు చేయాలని పాఠశాల పనివేళల్లో బోధనేతర పనులు, శిక్షణా తరగతులు లేకుండా చూడాలని కోరారు. ప్రభుత్వం జీవో 19 ద్వారా 9 రకాల పాఠశాలలు ఏర్పాటు చేసిందని, 9652 మోడల్ ప్రాథమిక పాఠశాలు, 1నుంచి 10 తరగతుల ఉన్నత పాఠశాలలో 1552, ప్రాథమికోన్నత పాఠశాలలు అప్డేగ్రేడ్ చేసి 779 ఉన్నత పాఠశాలలు, ఫౌండేషన్ పాఠశాలలో 5000, బేసిక్ ప్రాథమిక పాఠశాలలో 19,000 ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఫౌండేషన్, బేసిక్ ప్రాథమిక పాఠశాలలు ఏకోపాధ్యాయ పాఠశాలలుగా మారే ప్రమాదం ఉందని, వీటిని బలమైన పాఠశాలలుగా మార్చుకోవాల్సిన అవసరం ఉందని తద్వారా ప్రభుత్వ విద్యారంగ మనుగడ సాధ్యపడుతుందని అన్నారు. జీవో 22 ద్వారా జరిగిన ఉపాధ్యాయుల బదిలీలలో 67, 732 మంది బదిలీ అయ్యారని, 4, 779 మందికి ప్రమోషన్ రావడం జరిగిందన్నారు. జిల్లా అధ్యక్షులు సోమశేఖర్ నాయుడు మాట్లాడుతూ ఆర్థిక బకాయిలు చెల్లించాలని, పిఆర్‌సి కమీషన్ నియమించి, 30శాతం ఐఆర్ ప్రకటించాలని, డిఎ చెల్లించాలని డిమాండ్ చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.మణిగండన్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో పిల్లలను చేర్పించుటకు నమోదు డ్రైవ్‌ను జులై 5 వరకు చేపట్టాలని యుటిఎఫ్ కేడర్ అంతా నమోదు కార్యక్రమంలో పాల్గొనాలని 10మంది పిల్లలను చేర్పించిన వారిని మండలస్థాయిలో, 20మంది పిల్లలు చేర్పించిన వారిని జిల్లా స్థాయిలో అభినందన కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. యుటిఎఫ్ జిల్లా నాయకులు ఎస్.రెహానా బేగం, కే.రెడ్డప్ప నాయుడు, రాష్ట్ర కౌన్సిలర్లు ఎస్పీ.బాషా, పిఆర్.మునిరత్నం, జిల్లా కార్యదర్శులు ఏ కృష్ణమూర్తి, సిపి.ప్రకాష్, కె.సరిత, టి.దక్షిణామూర్తి, పంటపల్లి సురేష్, ఎం.పార్థసారథి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి జీవీ రమణ

జిల్లాలోని ప్రజాసమస్యలపై సిఎం స్పందించాలి

ముఖ్యమంత్రికి సిపిఎం బహిరంగ లేఖ

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: రాష్ట్ర ముఖ్యమంత్రి సొంత జిల్లా అయిన చిత్తూరులో అన్ని వర్గాల ప్రజలు రకరకాల సమస్యలతో సతమతమవుతున్నారని, ఆ సమస్యలు పరిష్కారం కోసం జూలై 2,3 తేదీల్లో జిల్లా పర్యటన వస్తున్న సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పందించాలని సిపిఎం జిల్లా కన్వీనర్ వాడ గంగరాజు ఆదివారం బహిరంగ లేఖ రాశారు. ఆ లేఖలో ఆయన పలు సమస్యలు ప్రస్తావించారు. జిల్లాలో ప్రధానంగా అత్యధిక సంఖ్యలో ఉన్న మామిడి రైతులు ప్రభుత్వం ప్రకటించిన గిట్టుబాటు ధర అమలు చేయకపోవడంతో రోజురోజుకీ సమస్య తీవ్రతరం అవుతున్నదన్నారు. గుజ్జు పరిశ్రమల యాజమాన్యాలు కలెక్టర్ ఆదేశాలను ఏమాత్రం లెక్క చేయకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని, రైతులు రోజుల తరబడి ఫ్యాక్టరీల వద్ద పడిగాపులు కాస్తూ ఇబ్బందులు పడుతున్న పరిస్థితి ఉందన్నారు. మామిడి రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. అదేవిధంగా కుప్పం నియోజకవర్గంలో ఎయిర్పోర్ట్ ఏర్పాటు కోసం సేకరిస్తున్న భూములు రైతులు తమ భూములు కోల్పోతున్నామని మా భూములు మాకే ఇవ్వాలని భూమి ఇచ్చే ప్రసక్తే లేదని గగ్గోలు పెడుతున్నారని, ఎయిర్పోర్ట్ భూసమస్యలు పరిష్కరించాలని తెలిపారు. అదేవిధంగా జిల్లాలో అత్యధిక మండలాల్లో ప్రాథమిక పాఠశాలలో రద్దుచేసి పక్క గ్రామాల్లో కలపడంతో పిల్లల తల్లిదండ్రులు ప్రతిరోజు నిరసన వ్యక్తం చేస్తున్న పరిస్థితి ఉందని, అక్కడ ఉన్న స్కూల్స్ అక్కడే కొనసాగించాలని కోరారు. అంతేకాకుండా మహిళలపై నిరంతరం కుప్పం నియోజకవర్గంలో దాడులు జరుగుతున్నాయని, వాటిని అరికట్టాలని కోరారు. జిల్లాలో అన్ని మండలాల్లో రెవెన్యూ సమస్యలు తీవ్రంగా ఉన్నాయని వాటిని పరిష్కారం చేసేలా ముఖ్యమంత్రి స్పందించాలని కోరారు. జిల్లాలో ఉన్న మైనింగ్ మాఫియా తీవ్రతరమవుతున్నదని పేదల ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఇసుకను, ఎర్రమట్టని అరికట్టతామని ఎన్నికల ముందు ఇచ్చిన హామీని అమలు చేయకుండా అధికార పార్టీ నాయకులు ఆ వ్యాపారాలు చేస్తూ ప్రజలను భయభ్రాంతులను చేస్తున్నారని, మైనింగ్ మట్టి మాఫియాలను అరికట్టాలని డిమాండ్ చేశారు. జిల్లాలో అత్యధికంగా పాడి రైతులు ఉన్నప్పటికీ పాల డెయిరీలు రైతులకు గిట్టుబాటు ధర లేకుండా దోచుకుంటున్నారు. పాల రైతులను ఆదుకోవాలని, అలాగే జిల్లాల స్కీం వర్కర్లు రకరకాల సమస్యలు ఎదుర్కొంటున్నారని వాళ్ళ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఇలా జిల్లాలో రోజురోజుకీ సమస్య తీవ్రతరం అవుతున్న సందర్భంగా సీఎం సొంత జిల్లాకు ప్రత్యేక నిధులు కేటాయించి సమస్యలను పరిష్కరించి నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించే పరిశ్రమలు ఏర్పాటు చేయాలని కోరారు. ఈసమస్యలపై సిపిఎం దశలవారీగా ఆందోళన పోరాటాలకు సిద్ధమవుతున్నట్లు తెలిపారు.

నగరాన్ని అన్ని విధాల అభివృద్ధి చేస్తాం..

- నరసింహ ప్రసాద్, చిత్తూరు నగరపాలక సంస్థ కమిషనర్

ఇంటర్వ్యూ



నరసింహ ప్రసాద్, నగరపాలక సంస్థ కమిషనర్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: చిత్తూరు నగరంలోని 50 డివిజన్లలో ప్రజలకు అవసరమైన తాగునీరు, వీధి దీపాలు, మురుగు నీటి కాలువలు, రోడ్లు నిర్మాణం చేపట్టి అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు నగర పాలక సంస్థ పాలక వర్గ సహాయ సహకారాలతో కృషి చేస్తున్న నగర కమిషనర్ నరసింహ ప్రసాద్ తెలిపారు. ప్రస్తుతానికి చిత్తూరు నగరంలో ఎక్కడా తాగునీటి సమస్య లేదని ఈ మేరకు అన్ని రకాల ముందస్తు చర్యలు తీసుకోవడం వల్ల ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేదన్నారు. సమస్య ఉన్నట్లు తమ దృష్టికి వస్తే ట్రాన్స్‌ఫోర్టు ద్వారా నీటి అందిస్తున్నట్లు చెప్పారు. నగర అభివృద్ధి కోసం చేపడుతున్న కార్యక్రమాలపై నగర కమిషనర్ ప్రజాశక్తి ప్రత్యేక ఇంటర్వ్యూ...

ప్రజాశక్తి: చిత్తూరు నగర పాలకసంస్థ పరిధిలో తాగునీటి సమస్య ఎలా ఎదుర్కొంటున్నారు..?

కమిషనర్: చిత్తూరు నగరపాలక సంస్థ పరిధిలోని 50 డివిజన్లలో ప్రస్తుతానికి ఎక్కడా తాగునీటి సమస్యలేదు. ఎన్‌టిఆర్ జలాశయంలో నీటి నిల్వలున్నాయి. సమస్య ఉన్న చోట్ల ట్యాంకర్ల ద్వారా సరఫరా చేస్తున్నాం.

ప్రజాశక్తి: నగర అభివృద్ధిలో ప్రస్తుతం చేపడుతున్న కార్యక్రమాలేమిటి..?

కమిషనర్: చిత్తూరు నగర అభివృద్ధిలో భాగంగా కట్టమంచి చెరువు లోతు పెంచడం జరుగుతోంది. దీని ద్వారా భూగర్భజలాలు పెరిగే అవకాశముంది. అలాగే సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం చేపడుతున్నాం. గంగినేని చెరువు, కాజూరు చెరువులను అభివృద్ధి చేసి పార్కులు ఏర్పాటు చేస్తున్నాం.

ప్రజాశక్తి: ప్రజాఆరోగ్య పారిశుధ్య కార్యాక్రమాలు ఎలా జరుగుతున్నాయి..?

కమిషనర్: ప్రజాఆరోగ్యానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతోంది. దోమల నివారణ కోసం ఫాగింగ్ చేయడం, తడి చెత్త పొడి చెత్త వేరుగా సేకరించడం జరుగుతోంది. ఇంటింటా చెత్త సేకరణ సమర్థవంతంగా నిర్వహిస్తున్నాం.

ప్రజాశక్తి: వార్డు కార్యదర్శులు బదిలీలు ఎలా జరిగాయి...?

కమిషనర్: కౌన్సిలింగ్ ప్రక్రియ మొదటి రోజు వార్డు అడ్మిన్ కార్యదర్శులు 153 మంది, వార్డు అమినిటీ కార్యదర్శులు 178, వార్డు ప్లానింగ్ కార్యదర్శులు 143 మంది చొప్పున మొత్తం 474 కౌన్సిలింగ్ నిర్వహించాం. రెండో రోజు వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్యదర్శులు 184 ఎడ్యుకేషన్ అండ్ డేటా ప్రాసెసింగ్ కార్యదర్శులు 192, వార్డ్ శానిటేషన్ అండ్ ఎన్విరాన్మెంటల్ కార్యదర్శులు 143, రిక్వెస్ట్ బదిలీల కోసం దరఖాస్తు చేసుకున్న 38 మంది హాజరై ఆప్షన్ ఫామ్స్ సమర్పించారు. రెండు రోజులపాటు జరిగిన కౌన్సిలింగ్ ప్రక్రియలో వార్డు సచివాలయాల పరిధిలో 6 కేటగిరీలకు చెందిన కార్యదర్శులకు కౌన్సిలింగ్ నిర్వహణ సజావుగా పూర్తి అయ్యింది.


ప్రజాశక్తి: పీజిఆర్‌ఎస్‌లో వస్తున్న సమస్యలు పరిష్కరిస్తున్నారా...?

కమిషనర్: ప్రజాసమస్యల పరిష్కావేదిక ప్రతి సోమవారం నగర పాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించడం జరుగుతోంది. ప్రజల నుండి అందుతున్న ఫిర్యాదులను వెంటనే ఆయా సచివాలయ సిబ్బంది ద్వారా పరిష్కరించడం జరుగుతోంది.

ప్రజాశక్తి : హైరోడ్డు విస్తరణ పనులు ముందుకు సాగుతున్నాయా...?

కమిషనర్: హైరోడ్డు విస్తరణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. కట్టమంచి నుండి రెడ్డిగుంట కొత్త కలెక్టరేట్ వరకు రోడ్డు విస్తరణ చేపట్టాల్సి ఉంది. ఈమేరకు భవన యజమానులతో సమావేశాలు నిర్వహించి ఒప్పించడం జరిగింది. ముందుగా ప్రభుత్వ భవనాలు తొలగించి ప్రైవేట్ భవనాలను తొలగించడం జరుగుతోంది.

'డైట్ ' ప్రిన్సిపాల్‌గా డీఈవో వరలక్ష్మీ



బాధ్యతలు చేపడుతున్న డీఈవో వరలక్ష్మి

ప్రజాశక్తి- కార్వేటినగరం: జిల్లా విద్యాశిక్షణా సంస్థ (డైట్) ప్రిన్సిపాల్‌గా డీఈవో బి.వరలక్ష్మి ఆదివారం బాధ్యలు చేపట్టారు. గతంలో డైట్ ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ శేఖర్ పదవీవిరమణ పొందడంతో చిత్తూరు జిల్లా డీఈవోగా విధులు నిర్వహిస్తున్న వరలక్ష్మి డైట్ ప్రిన్సిపాల్‌గా (ఎఫ్ఎసీ) బాధ్యతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న డైట్ కళాశాలల్లో అత్యున్నత స్థానంలో ఉన్న కార్వేటినగరం డైట్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు చేపట్టడం అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు. అధ్యాపకులు సమయపాలన పాటించి అత్యుత్తమ ఫలితాలు సాధించాలని, డైట్ కాలేజీకి మరింత పేరు ప్రతిష్టలు తీసుకురావాలని సూచించారు. అనంతరం కళాశాల అధ్యాపకులు డీఈవో వరలక్ష్మికి పుష్పగుచ్చాలు అందించి, శాలువలు కప్పి ఘనంగా సన్మానించారు.

ప్రజాసమస్యల పరిష్కార వేదిక రద్దు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ఈనెల 30వ తేదీ సోమవారం చిత్తూరు కలెక్టరేట్‌లో నిర్వహించాల్సిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం రద్దు చేసినట్లు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు ఎవరూ కలెక్టర్ కార్యాలయానికి రావొద్దని ఆయన పేర్కొన్నారు. అడ్మినిస్ట్రేషన్ గ్రౌండ్స్ కింద పిజిఆర్ఎస్ కార్యక్రమం రద్దయినందున ప్రజలు వ్యయప్రయాసలు పడి కలెక్టరేట్ కార్యాలయానికి రావొద్దని తెలిపారు. ఈ విషయాన్ని జిల్లా ప్రజలు గమనించాలని ఆయన కోరారు.

అంతర్ రాష్ట్ర దొంగ అరెస్టు

ఐదు ద్విచక్రవాహనాలు స్వాధీనం

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: చిత్తూరు పట్టణం పరిసర ప్రాంతాలలో ద్విచక్ర వాహనాలు దొంగతనానికి పాల్పడిన తమిళనాడు రాష్ట్రానికి చెందిన అంతర్‌రాష్ట్ర దొంగ రాజేష్‌ను అరెస్టు చేసిన అతని నుంచి సుమారు రూ. 3,00,000లు విలువ కలిగిన 5 ద్విచక్ర వాహనాలను చిత్తూరు వన్‌టౌన్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ద్విచక్రవాహన దొంగల కోసం వన్, టూటౌన్ సిఐలు మహేశ్వర, నెట్టికంటయ్య ఎస్ఐలు చేపట్టిన దర్యాప్తులో భాగంగా ఆదివారం రెడ్డిగుంట జంక్షన్‌లో వాహనాలు తనిఖీ చేస్తుండగా వేలూరు వైపు నుండీ వస్తున్న రాజేష్‌ను అదుపులోకి తీసుకొని విచారించారు. చిత్తూరు పట్టణం, పరిసర ప్రాంతాలలో జన సంచారం తక్కువగా ఉన్న చోట పార్క్ చేసిన మోటార్ సైకిల్స్‌ను దొంగలిచుకొని పోయి తమిళనాడులో తక్కువ రేటుకు అమ్ముకొని, వచ్చిన డబ్బులతో విలాసవంతమైన జీవితం గడిపేవాడని పోలీసులు విచారణలో తేలిందన్నారు. నిందితుడు రాజేష్ తమిళనాడు రాష్ట్రానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు.

స్లో మోటార్ సైకిల్ రైడింగ్



సైకిల్ రైడింగ్ పోటీలను ప్రారంభిస్తున్న ట్రాఫిక్ సిఐ నిత్యబాబు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: చిత్తూరులోని జిల్లా సాయుధ దళం కార్యాలయంలో ట్రాఫిక్ పోలీసు స్టేషన్ సిబ్బందికి ఆదివారం ఉదయం స్లో మోటార్ సైకిల్ రైడింగ్ పోటీని ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ నిత్యబాబు అధ్వర్యంలో నిర్వహించారు. ఈ ప్రాథమిక పోటీ, త్వరలో జరగనున్న ఓపెన్ స్లో మోటార్ సైకిల్ రైడింగ్ పోటీకి ప్రీ-ట్రయల్‌గా నిర్వహించినట్లు తెలిపారు. ఈ పోటీలో కానిస్టేబుల్ మార్కొండన్ మొదటి స్థానం, రాజేష్ రెండవ స్థానం, తేజోవతి మూడవ స్థానంలో నిలిచారని, తెలిపారు. ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ మాట్లాడుతూ ట్రాఫిక్ నియమాల పట్ల ప్రజలకు అవగాహన పెంపొందించేందుకు ఇలాంటి పోటీలు ఉపయోగకరంగా ఉంటాయని, డ్రైవింగ్ లైసెన్స్ కలిగి పోటీకి దరఖాస్తు చేసుకున్న ప్రజలు రాబోయే ఓపెన్ పోటీలో పాల్గొనాలని కోరారు.

మీడియాపై దాడులు సిగ్గుచేటు

గాంధీ విగ్రహం ఎదుట ఏపిడబ్ల్యూజేఎఫ్ నిరసన

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: హైదరాబాదులోని మహా న్యూస్ ఛానల్ ప్రధాన కార్యాలయంపై భారత రాష్ట్ర సమితి (బిఆర్ఎస్) పార్టీ నాయకులు, కార్యకర్తల దాడిని నిరసిస్తూ చిత్తూరు నగరంలోని గాంధీ విగ్రహం సర్కిల్‌లో ఆదివారం ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (ఏపీడబ్ల్యూజేఎఫ్) ఆధ్వర్యంలో జర్నలిస్టులు ధర్నా నిర్వహించారు. ఏపీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర నాయకులు కవరకుంట్ల జయరాజ్, జిల్లా అధ్యక్షులు బి.ప్రకాష్, జిల్లా కోశాధికారి కపానందరెడ్డి, సంయుక్త కార్యదర్శి యాదవేంద్రరెడ్డి, ఏపీ బీజేఏ జిల్లా సంయుక్త కార్యదర్శి కమలాపతిరెడ్డి, ఏపీడబ్ల్యూజేఎఫ్ చిత్తూరు నియోజకవర్గ అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు ఏ.కేశవులు, బాలసుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.



మహాన్యూస్ ఛానల్‌పై దాడిని నిరశిస్తూ జర్నలిస్టుల ధర్నా



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

అన్నదాతల కల సాకారమయ్యేనా?

నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌ఛార్జి ఆవుల గోపి

ప్రజాశక్తి- కుప్పం రూరల్ : కుప్పం నియోజకవర్గ అన్నదాతల కల సాకారం అయ్యేది ఎన్నడూ?' నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌ఛార్జి ఆవుల గోపి ప్రశ్నించారు. పట్టణంలోని కాంగ్రెస్ కార్యాలయంలో ఆ పార్టీ పట్టణ అధ్యక్షులు నిజాం ఆధ్వర్యంలో ఆదివారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 40 సంవత్సరాలుగా చంద్రబాబు కుప్పంలో చేసిన అభివృద్ధి శూన్యం అని ఆరోపించారు. కాంగ్రెస్ చేసిన అభివృద్ధిని తాము చేసినట్లు ప్రచారం చేసుకుంటున్నారని, టిడిపి హయాంలో కేవలం కార్పొరేట్ సంస్థలు మాత్రమే లాభపడ్డాయన్నారు. కుప్పం డిగ్రీ కళాశాలతో పాటు నియోజక వర్గంలోని నాలుగు మండలాలలో కస్తూరిబా గాంధీ గురుకుల పాఠశాలలు తీసుకొచ్చిన ఘనత కాంగ్రెస్‌కే దక్కిందన్నారు. నియోజకవర్గంలోని అన్నదాతలకు సాగునీరు, ప్రజలకు తాగునీరు అందించడానికి హంద్రీ-నీవా తీసుకు వస్తామంటూ ప్రభుత్వాలు ప్రగల్భాలు పలుకుతున్నాయన్నారు. ప్రభుత్వాలు మారినా అన్నదాతలకు సాగునీరు అందడం లేదని, వచ్చే జులై 2,3 తేదీలలో కుప్పం పర్యటనకు రానున్న ముఖ్యమంత్రి చంద్రబాబు హంద్రీ-నీవా పనులను పూర్తిచేసి, నియోజకవర్గ ప్రజలకు నీరు అందించడంపై ఖచ్చితమైన హామీ ఇవ్వాలని డిమాండు చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

కొంత సొమ్ము చేసుకుంటున్నారు!

• పర్మిట్లు జారీపై అధికారుల తీరు మారాలి • మామిడి రైతుల నిరసన

ప్రజాశక్తి -గంగాధర నెల్లూరు: మామిడి పర్మిట్ల జారీ విషయం లో అధికారులు కొంత సొమ్ము చేసు కుంటున్నారని అధికారుల తీరుకు నిరసనగా మామిడి రైతులు పెద్ద ఎత్తున స్థానిక జైన్ మామిడి గుజ్జు పరిశ్రమ వద్ద ఆదివారం రహదారిపై ఆందోళన చేపట్టారు. ఈ సందర్భం గా మామిడి రైతులు మాట్లాడుతూ మామిడి పర్మిట్లు జారీ విషయంలో అధికారులు కొంత మంది సొమ్ము చేసు కుంటు న్నారని వారి తీరు మారాలని కోరారు. నాలుగు రోజులు పాటు పరిశ్రమ ఎదుట నిరీక్షించి నప్పటికీ తమకు పర్మిట్లు మంజూరు చేయలేదని ఆవేదన వ్యక్తం చేస్తూ రోడ్డుపై బైఠాయించారు. దీనిపై అధికారు లు స్పందించి తక్షణ మే తమకు న్యాయం చేయాలని పలువురు రైతులు కోరుతు న్నారు. ప్యాక్టరీ వద్ద తిండి తిప్పలు లేకుండా తాము అవస్థ లు పడుతున్నామని అధికారులు త్వరగా పర్మిట్లు జారీ చేయాలని వీటి విషయంలో కొంత సొమ్ము చేసుకోవడం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేస్తూ నిరసన వ్యక్తం చేశారు.



పర్మిట్లు జారీపై అధికారుల తీరుకు నిరసన వ్యక్తం చేస్తున్న మామిడి రైతులు



అనాథ మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహిస్తున్న దృశ్యం

అనాథ మృతదేహానికి అంత్యక్రియలు

ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: అనాథ మృతదేహానికి పోలీసులు ఆదివారం పోలీసులు అంత్యక్రియలు నిర్వహించారు. గంగాధర నెల్లూరులో గత కొంత కాలంగా షాపుల వద్ద ప్లాస్టిక్ బాటిల్ ఏరుకుంటున్న ఓ అనాథ వ్యక్తి శనివారం రాత్రి మృతి చెందాడు. ఆ అనాథ వ్యక్తి మృతి చెందినా ఎవరూ పట్టించుకోలేదని విషయం తెలుసుకుని పోలీస్ హెడ్ కానిస్టేబుల్స్ దాము, రెడ్డప్ప ముందుకొచ్చారు. వారు ఫ్రీజర్ బాక్స్ ఏర్పాటు చేసి మృతదేహం వద్ద ఓ వ్యక్తిని కాపలా వుంచి ఆదివారం ఉదయం చిత్తూరు సంతపేటకు చెందిన నిత్యాన్నదాన ఆశ్రమ నిర్వాహకులకు అంత్యక్రియలు చేసే బాధ్యతను అప్పగించారు.

మానసిక దృఢత్వానికి యోగా

ప్రజాశక్తి -విజయపురం (నగరి): మానసిక దృఢత్వానికి యోగా అవసరమని యోగా గురువులు పుల్లయ్య గురూజీ అన్నారు. సరస్వతి విజ్ఞాన మందిరంలో ఆదివారం నిర్వహించిన ఏఎంసీ కార్యక్రమంలో భాగంగా ఆయన యోగా ఆవశ్యకతను తెలిపారు. శరీరానికి వ్యాయామాలు ఎంత ముఖ్యమో మనసుకు కూడా అంతే ముఖ్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో యోగా నిర్వాహకులు ఎల్లప్పరెడ్డి, బాబు పాల్గొన్నారు.



మామిడి కాయల మండీలో సంభవించిన అగ్నిప్రమాదం

అగ్నిప్రమాదం

ప్రజాశక్తి- పలమనేరు:

పలమనేరు మార్కెట్ యార్డ్ లో ఒక ఫ్రూట్ మండీలో ఆదివారం అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. చెత్త ఎక్కువగా ఉండటం వల్ల ఎవరో ఆకతాయిలు చేసిన పని అయి ఉంటుందని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అగ్ని ప్రమాదంలో టమాటో ట్రేలు కాలిపోయాయి. వెంటనే స్పందించిన పలమనేరు అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను ఆర్పివేశారు. దాదాపు రూ .10 వేలు నష్టం వాటిల్లి వుంటుందని ఫైర్ ఆఫీసర్ తెలిపారు.



మాట్లాడుతున్న సిఐటియు నాయకులు

సంక్షేమ బోర్డు అమలు చేయాలి

సిఐటియు ఆధ్వర్యంలో భవన నిర్మాణ కార్మికల ధర్నా

ప్రజాశక్తి-పలమనేరు:

తమకు సంక్షేమ బోర్డు ద్వారా సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో పలమనేరులో భవన నిర్మాణ కార్మికులు ఆదివారం ధర్నా నిర్వహించారు. ఈ సమావేశానికి ఆ సంఘం నాయకులు పి సుధాకర్ అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో సిఐటియు జిల్లా అధ్యక్షుడు జై గిరిధర్ గుప్తా మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల సమస్యల వెంటనే పరిష్కరించాలని, వారికి సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని, వారికి అందించే పథకాలను నిలిపివేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన జీవోని 12, 14 రద్దు చేయాలని కోరారు. పెండింగ్ లో ఉన్న సంక్షేమ బోర్డు క్లైమ్స్ ను నుండి 2017 లో ఉన్న పెండింగ్ లను వెంటనే పరిష్కరించాలని కోరారు. సంక్షేమ బోర్డు నిధులను ఇతర పథకాలకు మళ్లించకుండా నిర్మాణం కోసం వినియోగించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చట్ట విరుద్ధంగా మళ్లించిన నిధులను సంక్షేమ పథకాలకు వాడాలని సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలకు అమలు చేయాలని ప్రస్తుతం ఇస్తున్న పథకాలని పరిహారాలను పెంచాలి కేంద్ర ప్రభుత్వం చట్టంలో ఉన్న పథకాలను అమలు చేయాలని 45 సంవత్సరాలు నిండిన బిల్డింగ్ కార్మికులకు పింఛను ఇవ్వాలని వారు మరణించిన కార్మికుడి భార్యకి వితంతు పెన్షన్ ఇవ్వాలని కార్మికుల చట్టాలని పాతవిధానంగా అమలు చేయాలని నాలుగు నాలుగు లేబర్ కోర్టు రద్దు చేయాలని పని గంటలు తగ్గించాలని పిలుపునిస్తూ జూలై 9వ తేదీ నిర్వహించనున్న దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు రవి , బాషా, శ్రీరామయ్య, వెంకటరమణ, శీనన్న పాల్గొన్నారు.



వైసిపి ఇన్‌ఛార్జిని సన్మానిస్తున్న లోకనాథంనాయుడు

కృపాలక్ష్మికి సన్మానం

ప్రజాశక్తి -కార్వేటినగరం: కార్వేటినగరంమండల పంచాయతీ రాజ్ ఉపాధ్యక్షులుగా లోకనాథం నాయుడు నియమించేందుకు కృషి చేసిన మాజీ డిప్యూటీ సీఎం నారాయణ స్వామి, వైసీపీ జీడి నెల్లురు ఇన్‌ఛార్జి కృపాలక్ష్మిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. 20 29 ఎన్నికలలో కృపాలక్ష్మి విజయానికి కృషి చేస్తామని తెలిపారు. అనంతరం కృపా లక్ష్మిని లోకనాథం నాయుడు శాలువా కప్పి సన్మానించారు. మాజీ డిప్యూటీ సిఎం, మండల జెసిఎస్ ఛైర్మన్ పురంధర్, పంచాయతీరాజ్ ఉపాధ్యక్షుడు జి లోకనాథం నాయుడు, పట్టాభి రెడ్లను సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసీపీ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో పద్మనాభ శెట్టి పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న మీడియా ప్రతినిధులు

దాడి అమానుషం

మహాన్యూస్ కార్యాలయంపై దాడికి ఖండన

ప్రజాశక్తి- పలమనేరు: హైదరాబాద్ లోని మహా న్యూస్ ఛానల్ కార్యాలయంపై దాడి అమానుషమని సభ్య సమాజం తలదించుకునే విధంగా మీడియా స్వేచ్ఛను హరిస్తూ బిఆర్ఎస్ నాయకులు వ్యవహరించారని దాడికి కారణమైన వ్యక్తులను శిక్షించాలని పలమనేరు నియోజక వర్గ ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షులు రమేష్, ప్రింట్ మీడియా అధ్యక్షులు శ్యామ్ కుమార్ కోరారు. అనంతరం నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అమరనాథరెడ్డి

పారిశుధ్య పరిరక్షణే ప్రభుత్వ ధ్యేయం: ఎమ్మెల్యే

ప్రజాశక్తి-పలమనేరు: పచ్చదనం పారిశుధ్యమే 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర లక్ష్యం' అని పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి పేర్కొన్నారు. పలమనేరు మున్సిపల్ పరిధిలోని 8 వ వార్డులోని కంపోస్ట్ యార్డ్‌లో రూ. 1.12 కోట్లతో ఏర్పాటు చేయనున్న బయో రేమిడియేషన్, బయో మైనింగ్ ద్వారా వ్యర్థ భూముల పునరుద్ధరణ ప్లాంట్‌కు ఆదివారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశుధ్యంలో పలమనేరు మున్సిపాలిటీని రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిపేందుకు ప్రజలందరూ ముందుకు రావాలని కోరారు. ప్లాస్టిక్ వ్యర్థాలతో ఉత్పన్నమయ్యే సమస్యలను దృష్టిలో ఉంచుకొని ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాల్సిన అవసర ముందన్నారు. దీంతో పాటు పారిశుధ్యాన్ని మెరుగు పరచుకునే కార్యక్రమాలు చేపడుతూనే పచ్చదనం పై దృష్టి సారించాలన్నారు. ఆహ్లాదకరమైన వాతావరణానికి పెట్టింది పేరైన పలమనేరును పారిశుధ్య అంశంలో రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిపేందుకు మనం కృషి చేద్దామని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం కంపోస్ట్ యార్డ్ లోని వివిధ యూనిట్ లను ఆయన సందర్శించారు. తడి చెత్త – పొడి చెత్తల ద్వారా తయారయ్యే సేంద్రియ ఎరువు తయారీని ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎన్.వి. రమణారెడ్డి, మున్సిపల్ అధికారులు, సిబ్బందితో పాటు టిడిపి, జనసేన నాయకులు ఆర్వీ బాలాజీ,సుబ్రహ్మణ్యం గౌడ్, కుట్టి, గిరిబాబు, నాగరాజు, ఖాజా, క్రిష్ణ మూర్తి, కిరణ్, మదన్, శ్రీధర్, చాంద్ బాషా, జనసేన నాయకులు దిలీప్, నాగరాజు, శివ పాల్గొన్నారు.



వేడుకగా నాటక ప్రదర్శన

ప్రజాశక్తి -కార్వేటినగరం: కార్వేటినగరంలో ద్రౌపదీ ధర్మరాజుల స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా లక్కాగృహ దహనం నాటకాన్ని కనులకు కట్టినట్లు శ్రీవెంకటేశ్వర నాటక కళామండలి ఆధ్వర్యంలో ఆదివారం ప్రదర్శించారు. మధ్యాహ్నం భాగవతారిణి రెడ్డెమ్మ పాండవులు అరణ్యవాసంలో ఉన్నప్పుడు చేసిన లక్కాగృహ దహనాన్ని భక్తులను ఆకట్టుకునే విధంగా అభివర్ణించారు. ఉదయం ద్రౌపదీ ధర్మరాజుల వారి మూల విరాట్‌కు అర్చకులు అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఉభయ దారులైన రజకులు అమ్మవారికి సమర్పించిన సారెతో ద్రౌపదీ సమేత ధర్మరాజుల స్వామి ఉత్సవ మూర్తులతో పాటు శ్రీకృష్ణుని సుందరంగా అలంకరించి ప్రత్యేక వాహనంపై ప్రతిష్ఠించి మంగళ వాయిద్యాలు, బాణా సంచలు పేలుస్తూ గ్రామ వీధుల్లో ఊరేగించారు. మధ్యాహ్నం నాగరాజు యాదవ్ కుటుంబ సభ్యులు భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు రవియాదవు ప్రధాన కార్యదర్శి గౌతమ్ రాజు, ఉపాధ్యాక్షులు కట్టరపరెడ్డి, కోశాధికారి లక్ష్మీపతి, ఉపకోశాధికారి సాయిరాయల్, బాబాఆచారి, కుమార్ ఆచారి పలువురు భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



పలమనేరు బాలాజీ రచించిన పుస్తకాలను ఆవిష్కరిస్తున్న ప్రముఖ సాహితీ వేత్తలు

ఎరుకల జీవన గాథలకు బాలాజీ రచనలు దర్పణం

ప్రజాశక్తి -పలమనేరు: తెలుగు సాహిత్యంలో ఎరుకల జీవన గాథలను తొలిసారి వెలుగులోకి తీసుకువచ్చిన రచయిత పలమనేరు బాలాజీ అని, ఆయన రచనలు వారి జీవనానికి దర్పణం పడతాయని ప్రముఖ రచయిత, అనువాదకులు, వీక్షణం పత్రిక సంపాదకులు ఎన్ వేణుగోపాల్ అన్నారు. లయన్స్‌క్లబ్ సేవా కేంద్రం ఆధ్వర్యంలో 'పలమనేరు బాలాజీ ఎరుకల కథలు ఏకలవ్య కాలనీ', కవిత్వం లోపలేదో కదులుతున్నట్టు' పుస్తకాల ఆవిష్కరణ సభ ఆదివారం నిర్వహించారు. ఈ సభకు ప్రముఖ రచయితలు, కవులు విచ్చేశారు. ప్రముఖ రచయిత్రి వి ప్రతిమ మాట్లాడుతూ మానవ సంబంధాల గురించి కథలు, కవిత్వం ద్వారా సమాజానికి పలమనేరు బాలాజీ మంచి రచనలు అందించారన్నారు. ప్రపంచ సాహిత్యంలో ఆదివాసీలకు సంబంధించిన ముఖ్యమైన సాహిత్య చరిత్ర అందరూ అధ్యయనం చేయాల్సి ఉంటుందని, ఇదే క్రమంలో తెలుగు ఆదివాసి సమాజంలో ఎరుకల జీవితాలను వెలుగులోనికి తీసుకొని వచ్చి , ఎరుకల జీవితంలోని ఉద్వేగాలను కథలుగా పలమనేరు బాలాజీ మలచారని ప్రముఖ రచయిత సుంకోజి దేవేంద్రాచారి చారి అన్నారు. పలమనేరు బాలాజీ ఎరుకల కథలు ఏకలవ్య కాలనీ, కవిత్వం లోపలేదో కదులుతున్నట్టు పుస్తకాలను సభకు ప్రముఖ రచయితలు కవులు పరిచయం చేశారు. ఈ కార్యక్రమంలో కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కార గ్రహీత పల్లిపట్టు నాగరాజు, ప్రముఖ రచయితలు మంచికంటి, టి ఎస్ ఏ కృష్ణమూర్తి, కృష్ణ స్వామి రాజు, కవితశ్రీ, ఎండపల్లి భారతి, పి తులసినాథం నాయుడు, జక్కన్న, తొండవాని గోపీనాథ్, పేట యుగంధర్, నవ్యాంధ్ర రచయితల సంఘం చిత్తూరు జిల్లా అధ్యక్షురాలు కరణం విమల, రెడ్ క్రాస్ అసోసియేషన్ నాయకులు ఎంఆర్ సహదేవ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

దేవాలయాల అభివృద్ధికి సహకారం

టిటిడి పాలకమండలి సభ్యులు శాంతారాం



ప్రజాశక్తి- కుప్పం రూరల్ : కుప్పం నియోజక వర్గంలోని దేవాలయాల అభివృద్ధికి టిటిడి దేవ స్థానాలు సహకరిం చడంపై టిటిడి పాలక మండలి సభ్యులు శాంతారాం ప్రత్యేక ధన్య వాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూలై 2, 3 తేదీలలో ముఖ్యమంత్రి చంద్రబాబు కుప్పంలో పర్యటించ నున్నట్లు తెలిపారు. ఈ పర్యటనలో భాగంగా నియోజకవర్గ పరిధిలో పలు దేవాలయాల అభివృద్ధికి శంకుస్థాపన చేయనున్నారని తెలిపారు. ఆలయాల అభివృద్ధికి అవసరమయ్యే సొమ్ము 33 కోట్ల రూపాయలను టీటీడీ సమకూర్చనుందని, అయితే ఇందులో 25 శాతం ఆయా ఆలయాల తరపున స్థానికులు భరించాల్సి ఉంటుందన్నారు. ఈ విషయమై శనివారం టీటీడీ పాలకమండలి తిరుపతిలో సమావేశం నిర్వహించిందన్నారు. ఈ సందర్భంగా కుప్పం ప్రాంతంలో ఆలయాల అభివృద్ధికి ప్రజల తరపున 25 శాతం సొమ్ము సైతం టిటిడి మంజూరు చేసేలా చర్యలు చేపట్టాలని కమిటీ అధ్యక్షులు బిఆర్ నాయుడు, ఈవో శ్యామల రావులను కోరామని తెలిపారు. ఆయన విన్నపాన్ని ఆలకించిన టిటిడి అధికారులు సానుకూలంగా స్పందిం చడం ఆనందంగా వుందని కుప్పం ప్రజల తరపునుండి కృతజ్ఞతలు తెలిపారు.

యువత క్రీడల్లో రాణించాలి

ప్రజాశక్తి -బంగారుపాళ్యం: యువత క్రీడల్లో రాణించాలని టిడిపి యూత్ అధ్యక్షులు బాల సుబ్రహ్మణ్యం అన్నారు. మండలంలోని బలిజిపల్లిలో క్రికెట్ టోర్నమెంట్ ముగింపు కార్యక్రమం ఆదివారం నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువతలో దాగి వున్న నైపుణ్యాన్ని బయటకు తీసేందుకు పోటీ తత్వం పెరగ డం ద్వారా క్రీడల్లో రాణించేం దుకు ఎంతో అవకాశం వుంటుందన్నారు. తర్వాత తగ్గువారిపల్లి , బలిజిపల్లి క్రికెట్ జట్ల మధ్య సాగిన తుది పోరులో తగ్గువారిపల్లి క్రికెట్ టీం మొదటి స్థానం కైవసం చేసుకుంది. బలిజిపల్లి క్రికెట్ జట్టు ద్వితీయ స్థానం సాధించింది. ప్రథమ స్థానంలో గెలుపొందిన జట్టుకు రూ. 15 వేలు, రెండవ స్థానంలో గెలుపొందిన జట్టుకు పదివేల రూపాయలు క్రికెట్ నిర్వాహకులు మహేష్ జై కుమార్, ప్రేమ్ కుమార్ అందించారు.



క్రికెట్ కప్‌ను అందుకుంటున్న గెలిచిన జట్టు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి -వెదురుకుప్పం:

జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వెదురుకుప్పంలో 30 ఏళ్ల క్రితం చదివిన విద్యార్థులు ఆదివారం ఏర్పాటు చేసిన 'పూర్వ విద్యార్థు ల సమ్మేళనంలో' కలిసి ఒకరితో ఒకరు తమ జ్ఞాపకాలు పంచుకున్నారు. వెదురుకుప్పం జడ్‌పి ఉన్నత పాఠశాలలో 1994-95 వ సంవత్సరం విద్యనభ్యసించిన విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. సుమారు 50 మంది పూర్వ విద్యార్థులు ఒకే చోట కలిసి తమ తీపి గుర్తులను నెమర వేసుకున్నారు. విద్యా బుద్ధులు నేర్పించిన అప్పటి గురువులు జయ చంద్రారెడ్డి, శ్రీనివాసులును ఘనంగా సన్మానించి జ్ఞాపిక ను బహూకరించారు. పూర్వ విద్యార్థు లలో ఒకరు పాఠశాలకు వెయిటింగ్ మిషన్ పంపిణీ చేశారు. పాత జ్ఞాపకా లను ఒకరితో ఒకరు పంచు కుంటూ మధ్యాహ్నం అందరితో కలిసి భోజనం చేసి ఆనందంగా గడిపారు.



ఆత్మీయ సమ్మేళనంలో కలిసిన పూర్వ విద్యార్థులు

రామకుప్పం : రామకుప్పం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1984-85 సంవత్సరం లో పదవ తరగతి చదువుకున్న 50 మందికి పైగా పూర్వ విద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. అప్పటి తమ చిన్ననాటి మిత్రులతో సరదాగా సమ్మేళన కార్యక్రమం ఏర్పాటు చేసి రోజంతా సరదాగా గడిపారు. అప్పట్లో తమకు విద్యా బుద్ధులు నేర్పించిన గురువులకు స్థానిక టిటిడి కల్యాణ మండపంలో పూల మాలలు వేసి శాలువాలతో సన్మానించి వారి ఆశీర్వాదాలు అందుకున్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం విజయవంతం

ప్రజాశక్తి- కుప్పం టౌన్ : కుప్పం పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో సాయి మాత సేవ ట్రస్ట్ నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరం విజయ వంతంగా ముగిసిందని ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షులు జగదీష్ బాబు తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ తమ ట్రస్ట్ తరపున నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలలో భాగంగా ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించడం ఆలవాయితీగా వస్తోందన్నారు. ఇందులో భాగంగా ఆదివారం నిర్వహించిన వైద్య శిబిరానికి ప్రజల నుండి విశేష స్పందన వచ్చిందని, శిబిరంలో పాల్గొన్న వారిని పరీక్షించిన శారద కంటి ఆసుపత్రి వైద్యులు 30 మందిని శస్త్ర చికిత్స శస్త్ర చికిత్సకు ఎంపిక చేశారు. సోమవారం బెంగళూరు లోని శారదా కంటి ఆస్పత్రిలో ఉచిత వైద్య సేవలు అందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో శారదా కంటి ఆస్పత్రి వైద్యులు డాక్టర్ బాబు, డాక్టర్ వంశీ పాల్గొన్నారు.



వైద్య శిబిరంలో రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

క్రైం న్యూస్



కారు ఢీకొని మృతి చెందిన వృద్ధురాలు గౌరమ్మ

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలు మృతి

ప్రజాశక్తి- కుప్పం టౌన్ : రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధురాలు ప్రాణాలు పోగొట్టుకున్న ఘటన ఆదివారం కుప్పం పట్టణంలో చోటుచేసుకుంది. పలమనేరు క్రిష్ణగిరి జాతీయ రహదారి సామగుట్టపల్లి క్రాస్ వద్ద గౌరమ్మ (75) రోడ్డుపై వెళుతుండగా వేగంగా వచ్చిన కారు ఢీకొని ముందుకు దూసుకుపోయిందని స్థానికులు పేర్కొంటున్నారు. కారు ఢీకొట్టడంతో వృద్ధురాలు అక్కడికక్కడే మృతి చెందింది. స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాద తీరును పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని సమీప ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో ప్రమాదం చోటు చేసుకుందని, ఈ ప్రమాదంపై పూర్తి విచారణ జరిపి తమకు న్యాయం చేయాలని మృతురాలి కుమారుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పూర్తి వివరాలు పోలీసుల దర్యాప్తులో తెలియాల్సి వుంది.

టిడిపి బ్యానర్లు చించివేత

ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం : మండలం పిల్లారి కుప్పం క్రాస్ రోడ్ లో చిత్తూరు పుత్తూరు -జాతీయ రహ దారికి ఇరు వైపులా గంగా ధర నెల్లూరు ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ డాక్టర్ వి ఎం థామస్ జన్మదిన సందర్భంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చించి వేసిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు..28వ తేదీ శనివారం రాష్ట్ర చీఫ్ విప్ గంగాధర నెల్లూరు నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ వి ఎం థామస్ పుట్టినరోజు సందర్భంగా ఎస్ఆర్ పురం మండలంలోని పిల్లారి కుప్పం క్రాస్ రోడ్డు కు ఇరువైపులా టిడిపి కార్యకర్తలు ఏర్పాటుచేసిన బ్యానర్లను ఎవరో గుర్తు తెలియని దుండగులు శనివారం రాత్రి చించి వేశారు. ఆదివారం ఉదయం ఎస్ఆర్ పురం పోలీసులు చినిగిన బ్యానర్లను పరిశీ లించారు. టిడిపి నాయకుల ఫిర్యాదు మేరకు ఎస్ఆర్ పురం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



చించివేతకు గురైన బ్యానర్‌ను పరిశీలిస్తున్న పోలీసులు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

గతంలో కుటుంబ కలహాలతో కొడుకు ఆత్మహత్య
ఇప్పుడు కుటుంబ యజమాని మృతి
ఆ కుటుంబంలో విషాదఛాయలు

ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం : ద్విచక్రవాహనాన్ని గ్రానైట్ లోడ్‌తో వెళుతున్న వాహనం ఢీకొనడంతో ఆ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన ఆదివారం చోటు చేసుంది. పోలీసుల కథనం మేరకు... వెదురుకుప్పం మండలం లోని పెరుమాళుపల్లి గ్రామం దళితవాడకు చెందిన రమేష్ (44) ఎస్ఆర్‌పురం మండలంలోని క్షీర సముద్రం గ్రామంలో వారి సమీప బంధువు దశరథ అనారోగ్యంతో మృతి చెందడంతో దహన క్రియలకు హాజరై తిరిగి స్వగ్రామానికి ద్విచక్ర వాహనంపై బయలుదేరాడు. తిరుగు ప్రయాణంలో చిత్తూరు -పుత్తూరు జాతీయ రహదారి మర్రిపల్లి గ్రామం వద్ద గ్రానైట్ లోడ్‌తో వస్తున్న ఏపీ 39 యువై 44190 నెంబరు కల వాహనం వేగంగా వచ్చి ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో రమేష్ అక్కడికక్కడే మృతి చెందారు. డ్రైవర్ నిర్లక్ష్యంగా వేగంతోవాహనం నడపడంతోనే ఈ ప్రమాదం సంభవించిందని సంఘటన స్థలంలో ఆవులు మేపుతున్న స్థానికులు అంటున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి రమేష్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సుమన్ తెలిపారు. మృతుడు భార్య లలితమ్మకు నలుగురు సంతానం. ఓ కొడుకు ,ముగ్గురు కూతుర్లు ఉన్నారు. ఈ సంవత్సరం గత జనవరి నెలలో కొడుకు నాగేశ్వర్ (20) కుటుంబ కలహాలతో ఆత్మహత్య చేసుకొని మృతి చెందాడు. ఈ ఘటన మరవకముందే ఇప్పుడు కుటుంబ యజమాని రమేష్ మృతి చెందడంతో ఆ కుటుంబం అనాథగా మిగిలింది. ఈ విషయం తెలియడంతో ఆ గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.